# కుటుంబమును గాపాడిన బాలుడు

శ్రీమతి టి. చంద్రమతిగారు

హిందూదేశమును పాలించుచున్న మహిమ్మదీయ పరిపాలనములో ననేకమంది హిందువులు మహిమ్మదీయమత స్వీకరణము నిమిత్తమై ప్రభుత్వమువలన బాధింపబడుచు వచ్చిరి.

అప్పుడొక పల్లెటూరిలో కాపురమున్న యొక రైతు యీ బాధలు పడలేక మతము విడువ మనసొప్పక భార్యను ముగ్గురు బిడ్డలను దోడ్కొని హిందూరాజు పాలించు రాజ్యమునకు బోవ సంకల్పించుకొనెను.

తానట్లు దేశమువిడిచి పోవునట్లు రాజభటులకు దెలిసిన వారడ్డగింతురను భయమున తన బిడ్డలను ముగ్గురను గంపలలో బెట్టి గాడిదవీపుపైన వేసి కట్టి యాపైన కాయకూరలను ఆకుకూరలను సమృద్ధిగా వేసి మూసివేసెను.

పిమ్మట భార్యయు తానును కలసి గాడిదను నెమ్మదిగా తోలుకొనుచూ దారిని బోవువారికి సంతలో కాయకూరలమ్ముకొన బోవు వారను నభిప్రాయము గల్గించుచూ సాగిపోవుచుండిరి. అట్లు కొంతదూర మరుగు సరికి వారికొక సైనికుడెదురుపడెను. ఆ సైనికుడు వారి ముఖములు గాంచి వారి నిజస్థితిని గురించి యనుమానించి కాయకూరల మధ్య బిడ్డలదాచి తీసుకొనిపోవుచున్నారేమోనని తలచి 'మీ ఆనబకాయలు ముదురులో లేతలో చూచెదను' అని యనుచు కైజారుదీసి కత్తితో నా గంపలో బొడిచి పైకెత్తెను. కత్తిమొన యెరుపెక్కెనుగాని యేవిధమైన చప్పుడు వినరాలేదు. అందువలన నాతడు సందేహ విముక్తుడై కత్తి కంటిన యెరుపురంగు బహుశా యెర్రముల్లంగి దుంపల రసమైయుండునని తలచి వారిని విడచి వెడలిపోయెను.

పాప మా తల్లిదండ్రుల పరితాపమా యీశ్వరుని కెరుక. వారును ప్రాణములుగ్గబెట్టుకొని పొడవవచ్చు దుఃఖమును మ్రింగుకొనుచు మ్రింగుకొనుచు త్వరితముగా ఖరమును దోలికొని యొక నిర్జన ప్రదేశమును జేరిరి. తరువాత ఒక వైపున బిడ్డ లేవిధమైన యాపదజెందకుండ నిదురించుచుండిరేమో యను యాశయు మరియొకవైపున యా సైనికుని ఖడ్గము వారిని కిక్కురు మనకుండ చంపివేసినదేమో యను భయమును గల్గి డోలాయమానముగా మానసమూగులాడుచుండ వారు గబగబ నాగంపలపైనున్న కాయకూరలనులాగి పారవైచి గంపలు దెరచిచూచిరి. అందున్న బిడ్డలు జీవముల తోనె ఉండిరి. కాని యాఖరి బాలుని పైకి గీయునప్పటికి వాడు మూర్ఛిల్లునట్లుండెను. కాలి వ్రేలొకటి తెగిపడియుండెను వారా బాలుని పైకెత్తగానె యా బాలుడెంతో కష్టముతో కన్నులువిప్పి వారినిజూచి చిరునవ్వునవ్వి "కాని అమ్మా నేను ఏడ్వలేదు" అని ఎంతో గర్వముగా జెప్పి మూర్ఛపోయెను.

ఆ తల్లిదండ్రులా బాలునికివలయు నుపచారము లొనర్చుచూ సర్వేశ్వరునికి వందనశతంబు లర్పించిరి.